ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 5 జూన్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37(బుధవారం)
కనిష్ఠం : 29

బాల తిరుపతి వెళ్లొద్దాం 6
» నేటి నుంచి అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

## జనసేన ఆధ్వర్యంలో.. విజయోత్సవ సంబరాలు



పి.గన్నవరం శివారు పితానివారిపాలెంలో భోగిమంట వెలిగిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సంబరాల్లో భాగంగా సంప్రదాయ కోడిపందేల వద్ద పాల్గొన్న రాజోలు ఎమ్మెల్యే దేవ, కూటమి నాయకులు




ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా వేసిన ముగ్గు



అమలాపురం నల్లా గార్డెన్స్‌లో వీరమహిళల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలో జనసేన లోగో

అమలాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు హోరెత్తాయి. పి.గన్నవరం జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో పి.గన్నవరంలో విజయోత్సవ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. సంక్రాంతి వేడుకలు, ఇంటింటా దీపాలు, బాణసంచా కాల్పులు, ఎడ్లబండిపై ఎమ్మెల్యే ఊరేగింపుతోపాటు ఆకట్టుకున్న సంక్రాంతి ఉత్సవాల్లో పాటు గంగిరెద్దు విన్యాసాలు జరిగాయి. భారీగా జనసేన కేడర్ ఎమ్మెల్యే గిడ్డి నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని ఏడాది విజయోత్సవాలను ఘనంగా జరిపారు. రాజోలుకు చెందిన జనసేన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురంలో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు, ఇతర వేడుకలను హోరెత్తించారు. అమలాపురం పట్టణంలోని నల్లా గార్డెన్స్‌లో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు జనసేన మహిళా కౌన్సిలర్లు గొలకోటి విజయలక్ష్మి, గండి దేవిహారిక, తిక్కా సత్యలక్ష్మితో పాటు జనసేన నాయకుడు నల్లా శ్రీధర్ ఆధ్వర్యం వహించారు. జిల్లావ్యాప్తంగా జనసేన పార్టీ కేడర్ కార్యక్రమాలు చేపట్టాయి.

# 'సహకార' రైతులపై ఉక్కు పిడికిలి!



- » నిబంధనల పేరిట వడ్డీ రేటు పెంచేలా డీసీసీబీ ప్రణాళిక
- » స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ దాటి రుణం పొందితే 11 శాతం వడ్డీ
- » పంట రుణాలు మంజూరు చేయాలంటే ఫీల్డ్ విజిట్ తప్పనిసరి
- » ఉత్తర్వులు జారీచేసిన డీసీసీబీ సీఈవో
- » ఆందోళన చెందుతున్న రైతులు

**వ్యవసాయ సాగులో ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతున్న రైతులపై ఇప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా ఉక్కు పిడికిలి బిగించింది. నిబంధనల పేరిట వడ్డీ రేటును పెంచుతూ రైతులపై అధిక భారం మోపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తాల్లో రుణాలు పొందిన రైతుల నుంచి 7 శాతం వడ్డీకి బదులు 11శాతం వడ్డీ రేటును వసూలు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో గతనెల 30న ఇచ్చిన సర్క్యులర్ ఇప్పుడు రైతుల్లో చర్చనీయాంశమైంది. వడ్డీ రేట్లను పెంచుతూ డీసీసీబీ ఇచ్చిన ఉత్తర్వుల పై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలను రుణాల రూపంలో తీసుకుని సొసైటీలను నిలువునా ముంచేయడంలో కొందరు ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల నేతలు కీలక పాత్ర వహించడం వల్ల డీసీసీబీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. దీంతో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలు వర్తింపచేయడం ద్వారా 11శాతం వడ్డీని వసూలు చేయాలని డీసీసీబీ సర్క్యులర్‌ను సొసైటీలకు జారీచేసింది. అలాగే పలు నిబంధనలను అమలులోకి తేవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.**

(అమలాపురం - ఆంధ్రజ్యోతి)

డీసీసీబీ బ్యాంకు పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 298 సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో అత్యధికంగా కోనసీమ జిల్లాలో 166, తూర్పులో 49, కాకినాడలో 72, అల్లూరి జిల్లాలో 11 సొసైటీలున్నాయి. గతంలో పాలకుల తప్పిదాలు, స్కామ్‌ల వల్ల కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న సొసైటీల్లో కూడా రుణాల దుర్వినియోగంపై విచారణ కూడా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గతనెల 30న డీసీసీబీ ఒక సర్క్యులర్ జారీ చేసింది. 2025-26 సంవత్సరానికి బ్యాంకు ద్వారా సొంత భూములపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధికంగా పంట రుణాలు మంజూరుచేసిన రుణాల మొత్తానికి (ఏఎస్‌పీవో) సంబంధించి ఈ ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి సొసైటీల ద్వారా వ్యవసాయదారులకు ఎంసీఎల్ పద్ధతిలో పంట రుణాలను మంజూరు చేస్తున్నారు. ఆప్కాబ్ నుంచి పంట రుణాలు మంజూరుచేసిన మొత్తానికి రాయితీ వడ్డీ రేటుకు రీఫైనాన్స్ చేయడం లేదు. కానీ బ్యాంకు ద్వారా సంఘానికి 5.75శాతం వడ్డీకి పంట రుణాలు మంజూరు చేయడంవల్ల రైతు కేవలం 7 శాతం వడ్డీరేటుకి రుణం మంజూరు చేస్తారు. సకాలంలో రుణం తిరిగి చెల్లించిన రైతులకు 3శాతం వడ్డీ రాయితీ కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కానీ ఈ వడ్డీ రాయితీ కేంద్రం నుంచి జమకావడం లేదని సమాచారం. సొసైటీల పరిధిలో రైతులకు ఉన్న సొంత భూములై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కన్నా ఎక్కువ మొత్తంలో పంటరుణాలు మంజూరు చేశారు. సొసైటీలు కంప్యూటరీకరణ పూర్తికావడంతో ఎంసీఎల్ పద్ధతిన రుణాలు మంజూరు చేయడం వల్ల గతంలో సొంత భూమిపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధిక మొత్తాల్లో రుణాలు పొందినట్టు గుర్తించారు. అలా అధిక మొత్తాల్లో రుణాలు పొందిన వారికి ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీగానీ, పంటల బీమా పథకంగానీ వర్తించదు. ఈ నిబంధనలు అమలు వల్ల ఖాతాదారుల అనుమతితో అడిషనల్ ఎస్‌పీవోగా రుణాన్ని మార్పు చేయాల్సి ఉంది. ఆప్కాబ్ నుంచి రాయితీ వడ్డీ రేట్లకు రీఫైనాన్స్ రానందున కొత్త సభ్యులకు పంట రుణాలు మంజూరు చేయాలంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు రుణాన్ని పెంపుదల చేయాలన్నా, ఎడిషనల్ ఎస్‌పీవోగా సహకార సంఘాలకు 9.75 వడ్డీ రేటుకు, సంఘం ద్వారా మెంబర్లకు 11 శాతం వడ్డీరేటుకు పంట రుణాలు మంజూరు చేయాలన్నా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

### రుణం పొందాలంటే.. సవాలక్ష నిబంధనలు

రుణ ప్రణాళిక అమలులో కచ్చితంగా నిబంధనలు పాటించాలని కాకినాడ డీసీసీబీ బ్యాంకు సీఈవో జారీచేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. పంట రుణానికి సంబంధించి ఎడిషనల్ ఎస్‌పీవో వడ్డీరేటు 9.75శాతం(సహకార సంఘాలకు), 11శాతం సంఘం ద్వారా సభ్యునికి పీనల్ వడ్డీ 2శాతంగా నిర్ణయించారు. రుణ కాలవ్యవధిని ఏడాదిగా నిర్ణయించారు. వయోపరిమితి 15 నుంచి 65ఏళ్లు కలిగిన రైతులు వ్యక్తిగత రుణ పరిమితిని రూ.3 లక్షలకు పరిమితం చేశారు. షేర్ ధనాన్ని రుణం మొత్తంపై 10 శాతంగా నిర్ణయించారు. ఫిషరీస్ డైరీ ప్రయోజనాలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెట్టుబడి రుణాలు మంజూరుచేయాలి. రుణాలు మంజూరు చేసేటప్పుడు రైతుల నుంచి సొంత భూమికి సంబంధించి బ్యాంకు ఎస్‌పీవో పాలసీలో పొందుపరిచిన అన్ని ముఖ్యపత్రాలతోపాటు ఇ-క్రాప్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఖాతాదారుల మార్టుగేజ్ వివరాలు, డిక్లరేషన్ బాండ్ రిజిస్టర్‌లో పొందుపరిచి భద్రపరచాలి. సొసైటీల పరిధిలో సీఈవో, సూపర్‌వైజర్, రైతు సమక్షంలో ఫీల్డ్ విజిట్ చేసి రైతు పండించే భూములు, పంటలకు సంబంధించి జీపీఎస్ ఫొటోను తీసుకుని ఏఎస్‌పీవో ఫైలు నందు ఇతర డాక్యుమెంట్లతో భద్రపరచాలి. షాడో రిజిస్టర్ నిర్వహించాలి. కొత్త సభ్యులకు పంట రుణాలు మంజూరు చేయాలంటే జూన్ నాటికి ఆ సంఘం పరిధిలో 80శాతం పైబడి పంట రుణాలు రికవరీ ఉంటేనే కొత్తరుణాలు మంజూరు చేయాలి. ఇలా డీసీసీబీ విధించిన తాజా ఆంక్షలతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

## పెత్తనం అంతే.. పోనివ్వమంతే!

- » ప్రభుత్వం మారి ఏడాదైనా కీలక పోస్టుల్లో వైసీపీ సానుకూల అధికారులదే పెత్తనం
- » ఐదున్నరేళ్ల నుంచీ ఉమ్మడి, కాకినాడ జిల్లా డ్వామా పీడీగా చక్రం తిప్పుతున్న వెంకటలక్ష్మి
- » ఉమ్మడి జిల్లా పీడీగా పేదల ఇళ్ల స్థలాల చదును పనుల్లో భారీగా బొక్కుడు
- » రూ.550 కోట్లకుపైగా వైసీపీ నేతలకు అడ్డగోలుగా చెల్లించిన బిల్లుల్లో అక్రమాలు
- » విజిలెన్స్ విచారణలో ఇటీవల పీడీ అక్రమాలు నిర్ధారణ.. అయినా చర్యలు నిల్
- » ఐదున్నరేళ్ల నుంచీ పీడీ కుర్చీ దిగకుండా, బదిలీయే లేకుండా మళ్లీ పావులు
- » అటు ఐదేళ్లు వంగా గీత పీఏగా పనిచేసిన రామ్మోహన్ కలెక్టరేట్ ఏవోగా అక్రమాలు
- » నోడల్ జిల్లా ఏవో హోదాలో ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులకు ఏజెన్సీ బదిలీల పేరుతో పైరవీలు
- » ఉద్యోగులపై కలెక్టర్లు చర్యలు ఉపసంహరించిన కేసుల్లో లక్షల్లో గుంజుడు
- » కలెక్టరేట్‌లో ఏ కీలక ఫైలు కదిలినా ఇప్పటికీ వైసీపీ నేతలకు తక్షణమే ఫోన్లు
- » పౌర సరఫరాల సంస్థలో అక్రమాలపై విజిలెన్స్ బాధ్యుడిగా చేసినా చర్యలు నిల్



వెంకటలక్ష్మి



రామ్మోహన్

వారిద్దరు కీలక ప్రభుత్వ ఉద్యోగులు.. అంతకుమించి కీలకమైన ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరు తమ హోదాలను అడ్డంపెట్టుకుని చెలరేగిపోయారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమాలకు అడ్డగోలుగా సహకరించారు. అదే సమయంలో వీరూ తలాకొంత నొక్కేశారు.. అయితే ప్రభుత్వం మారిన తర్వాత వీరి పాపం పండినట్టేనని అంతా భావించారు.. తీరా సీన్ రివర్స్ అయింది.. ఒకరేమో ఇప్పటికీ అదే పోస్టులో దర్జాగా కొనసాగుతుండగా.. మరొకరు కీలకమైన ఉద్యోగ స్థానంలో దర్జాగా అన్నీ చక్కబెట్టేస్తున్నారు. తాజాగా బదిలీల సీజన్ మొదలవడంతో వీరిద్దరూ మళ్లీ అవే స్థానాల్లో కొనసాగేందుకు తెగ పావులు కదుపుతున్నారు. వీరిద్దరిపై గతేడాది విజిలెన్స్ కేసులు నమోదవగా, కనీసం చర్యలు కూడా లేకుండా ఉండేలా పైరవీలు చేస్తున్నారు. వారిద్దరే కాకినాడ జిల్లా డ్వామా పీడీ.. కాకినాడ కలెక్టరేట్ ఏవో రామ్మోహన్. 6



## సత్యదేవా.. ఏమిటీ వైపరీత్యం?

- » అన్నవరం దేవస్థానంలో ఇటీవల వరుస వివాదాలు
- » ఆలయ ప్రతిష్ఠ మసకబారే ప్రమాదం
- » కొందరు ఉద్యోగుల్లో బాధ్యతారాహిత్యం.. మరికొందరిలో నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి-అన్నవరం)

ఏ ఇంట శుభకార్యం జరిగినా ముందుగా గుర్తొచ్చేది అన్నవరం సత్యదేవుడి వ్రతం. ఈ ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. కానీ ప్రస్తుతం వరుస వివాదాలతో ఆలయ ప్రతిష్ఠ మసకబారే ప్రమాదం పొంచిఉంది. ఈ వివాదాలకు ప్రధాన కారణం కొందరు ఉద్యోగుల్లో బాధ్యతారాహిత్యం, మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే కారణం. దీనికితోడు సిబ్బందిని సమన్వయం చేసుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో మితిమీరిన అవినీతి కనిపించినా వివాదాలు రచ్చకెక్కలేదు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నతాధికారికి అవినీతి ఆనవాళ్లు లేకపోయినా అనుభవరాహిత్యంతో ఇతర విభాగాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. ఒక ఏఈవో దేవస్థానానికి జమచేయాల్సిన నగదు రూ.98 వేలు సొంతానికి వాడుకున్నాడు. ఇది రుజువుకావడంతో ఆ మొత్తం ఏఈవోతో దేవస్థానానికి జమ చేయించారు. ఇక రెండు వర్గాలుగా ఉన్న ఉద్యోగుల్లో ఎవరికి వారు పెత్తనం చెలాయించాలని చూసినా ఎవరికీ అవకాశం దక్కలేదు. ఆలయ వ్యవహారాల్లో ఈవో కుమారుడు పెత్తనం చేయడం అప్పట్లో ఈవో వెన్నంటి ఉండే ఒక సూపరింటెండెంట్ వ్యవహారశైలితో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగుల్లో కొందరు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ.. మరికొందరు సెలవు పెట్టడంతో వివాదం రాజుకుంది. దీనిపై పరిస్థితిని చక్కదిద్దేందుకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ విచారణ అధికారిగా అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ విచ్చేసి నివేదికను సమర్పించారు. ఇందులో ఈవో అవినీతికి పాల్పడలేదని, సిబ్బందిని సమన్వయం చేసుకోలేకపోయారని పొందుపరిచినట్టు సమాచారం. తదనంతరం భక్తుల సౌకర్యాల కల్పనలో అందుతున్న సేవలపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేల్లో అన్నవరం దేవస్థానం చివరి స్థానానికి చేరడంతో ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ నెలకొకసారి పర్యటించి పరిస్థితిని చక్కదిద్దారు. నీటి ఎద్దడి సాకుగా చూపించి దేవస్థానంలో మండు వేసవిలో భక్తులకు ఏసీ గదులు కేటాయించకుండా ఈవో తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని ప్రత్యామ్నాయ మార్గం వెతకాలని.. ఏసీ గదుల కేటాయింపు నిలుపుదల చేయడం సరికాదని సుతిమెత్తగా హెచ్చరించడంతో యథావిధిగా గదుల కేటాయింపు చేపట్టారు. సత్యదేవుడి కల్యాణోత్సవాల సమయంలో పలు ఆర్జిత సేవలను నిలుపుదల చేసిన సమయంలో వైదిక కమిటీ గతంలో నిర్వహించిన చండీ, ప్రత్యంగిర హోమాలను అదనంగా నిలుపుదల చేయడం వివాదాస్పదమైంది. దీంతో శృంగేరీపీఠాధిపతుల సూచనలతో ఏకీభవించి వారి అభిప్రాయం తీసుకోవాలని దానికి అనుగుణంగా నడుచుకోవాలని చైర్మన్ తెలపడంతో సద్దుమణిగింది. దేవస్థానంలో సేవ చేసేందుకు తెలంగాణ నుంచి విచ్చేసిన సేవా బృందంపై ఏఈవో దురుసుగా ప్రవర్తించడం తక్షణమే కొండ దిగి వెళ్లిపోవాలని లేకుంటే కేసులు పెడతామని హెచ్చరించడంతో విషయం వివాదాస్పదమైంది. దీంతో సేవకులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఏఈవోకు షోకాజు నోటీసు జారీ చేశారు. సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల్లో శ్రీపుష్పయోగం రోజున తన భార్యపై ఏఈవో అసభ్యకరంగా తాకి తోయడంతో నేరుగా ఆ భక్తుడు సీఎంవోకు ఫిర్యాదు చేయడంతో మరో వివాదం తెరమీదకొచ్చింది. దీంతో ఆ ఏఈవోను ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి మరో విభాగానికి మార్చారు. రెండురోజుల కిందట సీఆర్వోలో గదులు ఖాళీలున్నా కేటాయించకపోవడంతో భక్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి ఈవో సీఆర్వో కార్యాలయానికి చేరుకుని భక్తులకు దగ్గరుండి గదులను ఇప్పించారు. దీనికి అక్కడ పనిచేసే కౌంటర్ గుమస్తాల నిర్లక్ష్యం కారణంగా బాధ్యులను చేస్తూ ఇద్దరిని సస్పెండ్ చేశారు.

### క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటేనే..

ఈవో క్షేత్రస్థాయిలో తిరగకుండా కేవలం సమీక్షలు, సమావేశాలతో పాలన సాగించడంతో ఈ వివాదాలు పెరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. సిబ్బంది సైతం బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల జీతభత్యాలు, ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్లు అన్నీ.. దేవస్థానం ఖజానా నుంచి చెల్లించాలంటే భక్తుల పట్ల మర్యాదగా మెలగడం ద్వారా స్వామి సన్నిధిలోకి వివిధ రూపాల్లో ఆదాయం పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

## బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా..
# నెలరోజులు స్పెషల్ డ్రైవ్: జేసీ

అమలాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ సంక్షేమ విభాగాల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రణాళికా విభాగం ఆమోదాన్ని జారీ చేసే సమయంలో బిల్డర్ల నుంచి వసూలుచేసే 1శాతం లేబర్ సెస్‌ను భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి కార్మికశాఖ జమ చేయాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు, డీపీవోకు ప్రత్యేక సూచనలు చేశారు. ఇ-శ్రమ్ లక్ష్యాల పురోగతిపై సమీక్షించారు. ఇ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, సంక్షేమ, ఆర్థిక ప్రయోజనాల లబ్ధిని కార్మికులు పొందేలా చూడాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వ పథకాలను చేరవ చేసే దిశగా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లాలో 8లక్షల మంది కార్మికులను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడం లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 2.80 లక్షల మంది మాత్రమే నమోదు అయ్యారన్నారు. జిల్లాస్థాయి కమిటీ సభ్యులు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్మిక చట్టాలను అనుసరించి జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించేందుకు దాడులు నిర్వహిస్తూ వారికి పునరావాసం కల్పించడం వంటి బాధ్యతలను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ తీసుకోవాలన్నారు. యోగాంధ్ర సభ్యులను నమోదు చేయడంలో జాప్యాలను ఉపేక్షించేది లేదని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తప్పనిసరిగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ గాంధీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, సీడీపీవో శాంతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ నిర్వహణకు పటిష్ట చర్యలు

- » రేపటి నుంచి 30 వరకు పరీక్షల నిర్వహణ
- » జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- » కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈనెల 6 నుంచి 30 వరకు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తామన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలలు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ, స్కూళ్లల్లో స్కూలు అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, జువైనల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ స్కూళ్లల్లో ఎస్జీటీలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమపాఠశాలల్లో ఎస్జీటీలు, ట్రైన్డ్ గ్రాడుయ్యేట్ టీచర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు సంబంధించి మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతి సెషన్‌కు 150మంది చొప్పున రోజుకు ఒక్కో పరీక్షా కేంద్రంలో 300మంది అభ్యర్థులు హాజరయ్యేలా అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కేడర్‌కు తగ్గకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలన్నారు. పరీక్షలసమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ఆశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా చేపట్టాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చే యాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షాసమ యంలో బస్సులు నడిపేలా ట్రాన్స్‌పోర్టు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే దివ్యాంగులకు వారి అభ్యర్థన మేరకు నిబంధనలు అనుసరించి సహాయకులను అనుమతించేలా జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అమలాపురంలోని కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేస్తామన్నారు. అభ్యర్థుల హాల్‌టిక్కెట్లలో చిన్నచిన్న తప్పులుంటే సరైన గుర్తింపుకార్డుతో పరీక్షకు అనుమతించాలన్నారు. అనంతరం సరిచేసిన తప్పులను నివేదిక రూపంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు జిల్లా విద్యాశాఖాధికారి పంపేలా చర్యలు చేపట్టాలన్నారు. అభ్యర్థులంతా పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలన్నారు. డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరికీ కలెక్టర్ ఆల్‌దబెస్ట్ చెప్పారు.

గంగలకుర్రు అగ్రహారంలో మహిళ మెడలో చైన్‌స్నాచింగ్ 7


బాలబాలాజీ ఆలయంపై ఆకట్టుకునే శిల్ప సౌందర్యం

# బాల తిరుపతి.. వెళ్లొద్దాం

- కోరిన కోర్కెలు తీర్చే శ్రీనివాసుడు
- నేటి నుంచి అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం


అప్పనపల్లి బాలబాలాజీస్వామివారు

(మామిడికుదురు-ఆంధ్రజ్యోతి)

వైనతేయ నదీ తీరంలోని అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం బాలతిరుపతిగా వర్ధిల్లుతోంది. ఇక్కడ ఏడు ప్రదక్షిణలు చేసి ఏడు టెంకాయలు సమర్పిస్తే స్వామివారు కోరిన కోర్కెలను తీరుస్తారని భక్తుల విశ్వాసం. ఈనెల 5వతేదీ గురువారంనుంచి అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈసందర్భంగా ప్రత్యేక కథనం..

## ఆలయ చరిత

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాన్ని చూసేందుకు రెండు కళ్లూ చాలవన్నట్టుగా అద్భుతమైన శిల్ప సౌందర్యంతో సర్వాంగసుందరంగా నిర్మించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు మండలం అప్పనపల్లిలో ఈ ఆలయం ఉంది. ఇక్కడ పుట్టలో ఉన్న శ్రీకృష్ణుడికి పాలు ఇస్తున్న గోమాతను తదేకంగా చూస్తున్న యాదవుడి చిత్రంతోపాటు అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న చిత్రం ఆకట్టుకుంటున్నాయి. 1962లో గ్రామానికి చెందిన మొల్లేటి రామస్వామి తన కొబ్బరి కొట్టులో కనిపించిన చిన్న విగ్రహాన్ని అమర్చగా ఆ కొబ్బరి కొట్టే ఆలయంగా మారింది. అక్కడకు వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో భక్తులు భోజనాలకోసం పడుతున్న ఇబ్బందులు చూసి రామస్వామి ఆలయ ప్రాంగణంలోనే అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా 1977లో నిత్యాన్నదానాన్ని దేవస్థానంలో మొదలుపెట్టారు. అప్పనపల్లి నిత్యాన్నదానమే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవాలయాల్లో అన్నదానానికి ఆదర్శంగా నిలిచింది. ఆనాటినుంచి ఇప్పటివరకు దేవస్థానంలో నిత్యాన్నదానం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానంతో పాటు పిల్లలకు పాలు పంపిణీ చేస్తారు.

## దేవస్థానంలో జరిగే ఉత్సవాలు..

ప్రతిఏటా బహుళ పంచమి నుంచి సప్తమి వరకు పవిత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి దివ్యకల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విజయదశమి రోజున పద్మావతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, కార్తీక శుద్ధ ఏకాదశి రోజున స్వామివారికి లక్ష తులసి పూజ, ధనుర్మాస దీక్షలు నిర్వహిస్తారు. బహుళ చవితి రోజున గోదాదేవి కల్యాణం జరుగుతుంది. ఆలయంలో నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణ హోమం, సుప్రభాత సేవ, తొలిహారతి, వేద పారాయణలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు.

## రేపు రాత్రి 9.15 గంటలకు కల్యాణం

అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి తిరు కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభంకానున్నాయి. వీటిని ఘనంగా నిర్వహించడానికి ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గురువారం ఉదయం 6గంటలకు విశ్వక్సేనారాధనతో కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. స్వామివారు, ఉభయ దేవేరులను వధూవరులుగా తీర్చిదిద్ది ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం రాత్రి 9.15గంటలకు కల్యాణం జరుగుతుంది. ప్రతిరోజూ స్వామివారికి సుప్రభాతసేవ, సహస్రనామార్చనలు, వివిధ రకాల పూజలు జరుపుతారు. 7వతేదీ సాయంత్రం 4గంటలకు పండిత సత్కారం, 8వతేదీ ఉదయం పది గంటలకు స్వామివారికి వైనతేయనదిలో చక్రస్నానం, 9వతేదీ ఉదయం 9 గంటలకు చోరసంవాదం, సాయంత్రం రాత్రి గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు జరిగే ఐదురోజులూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.


కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లు



# చింతచిగురు కిలో రూ.600

- పట్టణాల్లో భారీగా డిమాండ్

(ఆత్రేయపురం-ఆంధ్రజ్యోతి):

కోనసీమలోని పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ ఉండే చింత చెట్ల నుంచి లభించే చింతచిగురుకు ఎంతో డిమాండ్ ఉంది. ప్రస్తుత వేసవి సీజన్‌లో చింతచిగురు పల్లెల్లో పుష్కలంగా లభిస్తోంది. చెట్టు ఎక్కి చిగురు కోసి పట్టణ, పల్లె ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. గృహిణులు చింతకూరను ఏడాదిపాటు ఉండేలా ఉప్పు కలిపి బిళ్లలు చేసి ఎండపెట్టి డబ్బాల్లో వేసుకుని ఏడాదిపాటు కూరలో ఉపయోగిస్తారు. చింతకూరతో చేసిన కూరలు భలే రుచిగా ఉంటాయి. చిగురులో విటమిన్-సి పోషకాలు అధికంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంపొందించి వ్యాధులను నయం చేస్తుంది. జీర్ణవ్యవస్థ మెరుగుపరచడంతో పాటు మలబద్దకం తగ్గించి ఆకలి పెరగడానికి దోహదం చేస్తుంది. చింతచిగురులో పోషకాలు ఉండడంతో రోగగ్రస్థులు అమితంగా ఇష్టపడతారు. దానికి ఉన్న డిమాండ్ రీత్యా కిలో రూ.600కి అమ్ముతున్నారు. ఈ సీజన్లో పప్పులో చింతచిగురు వేసి నెయ్యి వేసుకుని శాఖాహారులు ఎంతో ఇష్టంగా భుజిస్తారు. చింతచిగురు పచ్చిరొయ్య, చింతచిగురు మటన్, చింతచిగురు ఎండురొయ్య వంటి రకరకాల వంటకాలు మాంసాహారప్రియులు వండిస్తూ బంధుమిత్రులకు పంపించి రుచి చూపిస్తారు. చింతచిగురుతో నాన్‌వెజ్ వంటకాలు తిని తీరాల్సిందే. ఈ సీజన్‌లో ఎక్కడైనా కనిపిస్తే చింతచిగురు వదలద్దండోయ్.

# పెత్తనం అంతే... పోనివ్వమంతే

- ప్రభుత్వం మారి ఏడాదైనా కీలక పోస్టుల్లో వైసీపీ సానుకూల అధికారులదే పెత్తనం
- ఐదున్నరేళ్ల నుంచీ ఉమ్మడి, కాకినాడ జిల్లా డ్వామా పీడీగా చక్రం తిప్పుతున్న వెంకటలక్ష్మి
- ఐదేళ్లు వంగాగీత పీఏగా పనిచేసిన రామ్మోహన్ కాకినాడ కలెక్టరేట్ ఏవోగా అక్రమాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)పీడీగా ప్రస్తుతం వెంకటలక్ష్మి కొనసాగుతున్నారు. ఆమె 2020లో ఉమ్మడి జిల్లా డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచీ తన పలుకుబడి ఉపయోగిస్తూ బదిలీ లేకుండా ఇక్కడే కొనసాగుతున్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ నడుస్తుండడంతో బదిలీ ఆపించుకుని ఇక్కడే ఉండేలా పావులు కదుపుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఈమె అడ్డగోలుగా వ్యవహరించారు. పేదల ఇళ్లస్థలాల సేకరణ తర్వాత వాటిని చదును చేసే బాధ్యత డ్వామా పర్యవేక్షించింది. బిల్లుల చెల్లింపు అంతా ఈమె పర్యవేక్షణలోనే కొనసాగింది. ఈక్రమంలో ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో వందలాది లేఅవుట్ల చదునులో భారీగా అక్రమాలు జరిగాయి. ఈ పనులు చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు చదును పనులు నాసిరకంగా చేశారు. అయినా ఈమె కిమ్మనలేదు. ఎంచక్కా తన పర్సంటేజీతో బిల్లులు మంజూరు చేసేశారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ఉప్పాడ కొత్తపల్లి మండలం కొమరగిరిలో అప్పటి సీఎం జగన్ 850ఎకరాల లేఅవుట్‌కు శంకుస్థాపన చేశారు. సీఎం డ్రీం ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం ఇక్కడ ప్రత్యేక దృష్టిసారించింది. చదునుకు రూ.250 కోట్ల వరకు కేటాయించింది. ఈ క్రమంలో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కనుసన్నల్లో చదును జరిగింది. నిత్యం వందల టిప్పర్లలో రామేశంమెట్ట, పోలవరం కాలువల నుంచి అక్రమంగా మట్టి తరలించారు. గనుల శాఖకు సీనరేజీ చెల్లించకుండా డంప్ చేసేశారు. ఈ లేఅవుట్ చేయాల్సిన స్థాయిలో చదును చేయకుండానే చేసేసినట్లు సదరు పీడీ కోట్లలో బిల్లులు చెల్లించేశారు. ప్రభుత్వం మారిన తర్వాత కొమరగిరి లేఅవుట్ చదును అక్రమాలపై గతేడాది విజిలెన్స్ విచారణ మొదలుపెట్టింది. ఇందులో ద్వారంపూడికి సదరు పీడీ అడ్డగోలుగా బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఈమెపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అయినా ఇప్పటికీ ఈమెపై చర్యలు లేవు. అటు ఉమ్మడి జిల్లా పీడీగా చేసిన అక్రమాలపై ఇప్పటికీ విచారణ జరగలేదు. మరోపక్క ఉమ్మడి జిల్లా పీడీగా, ఆ తర్వాత జిల్లాల విభజనతో కాకినాడ జిల్లా పీడీగా మొత్తం ఐదున్నరేళ్ల నుంచీ ఈమె ఇక్కడే కొనసాగుతున్నారు. వివిధ విభాగాల ఉద్యోగుల బదిలీలు, ఇతర పోస్టింగ్‌ల్లో ఇప్పటికీ ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారు. ఎక్కడికక్కడ శాఖను సొంత కంపెనీలా మార్చేసుకుని అడ్డగోలుగా సంపాదించేశారు. ఇంత జరిగినా ఈమెపై ఇప్పటికీ చర్యలు లేవు. కనీసం బదిలీ కూడా లేదు. తాజా బదిలీల్లోను ఈమె ఇక్కడే కొనసాగేలా వైసీపీ నేతల ద్వారా రాయబేరాలు నడుపుతున్నారు.

## ఈయన మరీ ముదురు..

కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి(ఏవో)గా రామ్మోహన్ కొనసాగుతున్నారు. ఈయన వైసీపీ అయిదేళ్ల పాలనలో ఇష్టానుసారంగా వ్యవహరించారు. డిప్యూటీ తహసీల్దార్ హోదాలో కాకినాడ ఎంపీ వంగా గీత వద్ద ప్రభుత్వ పీఏగా చేరారు. ఆ తర్వాత కొలువును అడ్డంపెట్టుకుని అధికారులపై తెగ పెత్తనం చేశారు. తనకు కావాల్సిన వారిని వివిధ పోస్టింగ్‌ల్లో బదిలీ చేయించుకుని ఆ ఐదేళ్లు చెలరేగిపోయారు. ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎంపీ గీత రికమండేషన్‌తో కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో పోస్టింగ్ వేయించుకున్నారు. ప్రభుత్వం మారడంతో సదరు రామ్మోహన్ అరాచకాలకు చెక్‌పడుతుందని భావించారు. తీరా గీత ఒత్తిడితో అధికారులు ఈయనకు ఏకంగా కలెక్టర్ కార్యాలయ ఏవోగా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టరేట్‌లో కలెక్టర్, డీఆర్వో తర్వాత ఏవో పోస్టు అత్యంత కీలకం. జిల్లాలో ప్రభుత్వానికి, పాలనకు సంబంధించి అనేక కీలక నిర్ణయాల ప్రతిపాదనలు, నిర్ణయాలు ఏవో చేతులు మీదుగా ముందుకు సాగుతాయి. ఇవన్నీ ఎప్పటికప్పుడు ఇప్పటికీ వైసీపీ నేతలకు సదరు రామ్మోహన్ ద్వారా ముందే చేరిపోతున్నాయి. వారికి కావాల్సిన ఉద్యోగులు, అధికారులకు నచ్చిన చోట పోస్టింగ్‌లు ఇప్పటికీ ఈయన ద్వారా జరుగుతున్నాయి. జిల్లాలో పలువురు ఉద్యోగులపై గతంలో పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ చర్యల కేసులను ప్రస్తుత కలెక్టర్ షాన్‌మోహన్ మానవతా దృక్పథంతో రద్దు చేశారు. ఫైలు కలెక్టర్‌కు పంపే ముందే వారితో బేరాలు కుదుర్చుకుని లక్షల్లో సదరు ఏవో గుంజేశారు. వారసత్వం కింద చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కొంతకాలంగా ఇస్తున్న ఉద్యోగాలకు వారినుంచీ పోస్టును బట్టి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు పిండేశారు. కలెక్టరేట్, ఇతర తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రమోషన్ల తర్వాత ఉద్యోగుల పోస్టింగ్‌లకు సంబంధించి ఉన్నతాధికారులు సూచించిన జాబితాలను సదరు ఏవో పలుసార్లు లీక్ చేసి ఆ జాబితాలను తారుమారు చేసేశారు. దీనిపై ఉన్నతాధికారులు పలుసార్లు వార్నింగ్‌లు సైతం ఇచ్చిన పరిస్థితి. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీల సీజన్ నడుస్తుండడం, కాకినాడ కలెక్టరేట్ అల్లూరి జిల్లాతో సహా ఉమ్మడి జిల్లాకు నోడల్ కార్యాలయం కావడంతో సదరు ఏవో అనేక మంది ఉద్యోగులకు ఫోన్లు చేసి మీకు ఇంకా ఏజెన్సీ సర్వీసు లేదని, అక్కడకు వెళ్లాల్సి ఉంటుందనే సాకుతో అమ్యామ్యాలు పిండేస్తున్నారు. కాగా తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో తహసీల్దార్ క్యాడర్‌ఉన్న అధికారులు కలెక్టరేట్ ఏవోలుగా కొనసాగుతుండగా, కీలకమైన కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఏవోగా ఉప తహసీల్దార్ స్థాయి ఉన్న రామ్మోహన్‌ను కొనసాగిస్తుండడం విశేషం.

## విజిలెన్స్ కేసున్నా హవా..

రామ్మోహన్ గతంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. అప్పట్లో ధాన్యం రవాణా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరించారు. దీనిపై 2014-2015లో విజిలెన్స్ విచారణ చేపట్టింది. ధాన్యం సేకరణ సమయంలో ట్రక్ షీట్లు సమర్పించకముందే జాయింట్ కలెక్టర్ ఆమోదం లేకుండా రూ.3.50కోట్లు కాంట్రాక్టర్‌కు అడ్వాన్సుగా 2015, జనవరి, ఫిబ్రవరిలో చెల్లించినట్లు విజిలెన్స్ గుర్తించింది. ట్రక్ షీట్లలో సరుకు రవాణాయేతర వాహనాలు చూపితే అవి సరైనవో కావో చూడకుండా బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఏమాత్రం ఆధారాలు లేకపోయినా డీటీ హోదాలో రామ్మోహన్‌పై నిధులు చెల్లించినట్లు విజిలెన్స్ తేల్చింది. దీనిపై అప్పటి వైసీపీ నేతల ద్వారా పైరవీలు నడిపించిన రామ్మోహన్ కేసు లేకుండా చేసుకున్నారు. గతేడాది అక్టోబరు 10న మళ్లీ అతడిపై విజిలెన్స్ కేసును రెవెన్యూశాఖ బయటకు తీసింది. ఈ అక్రమాలపై అతడి నుంచి వివరణ కోరుతూ జీవో జారీ చేసింది. ఇంత జరిగి విజిలెన్స్ కేసు ఉన్నా సరే సదరు రామ్మోహన్‌ను అధికారులు ఈ కేసును దాచిపెట్టి ఏవో పోస్టులో కొనసాగించడం విశేషం. ప్రస్తుతం విజిలెన్స్ కేసు ఇబ్బందికరంగా మారడంతో రామ్మోహన్ ఈ కేసు నుంచి బయటపడేందుకు చక్రం తిప్పుతున్నారు. గతంలో ఇక్కడి పనిచేసి ప్రస్తుతం అమరావతిలో రెవెన్యూశాఖ విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్న కీలక అధికారి ద్వారా ఈకేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటు ఏవో పోస్టును వదలకుండా పైరవీలు తీవ్రతరం చేశారు.

# తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా డిప్యూటీ సీఎం పవన్

- నా జీతం-మీ జీవితం కోసం అంటూ 42మందికి రూ.2.1లక్షలు అందజేత


డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన నగదు సహాయాన్ని చిన్నారులకు అందజేస్తున్న జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా నిలిచేందుకు తనకు పిఠాపురం శాసనసభ్యుడిగా, మంత్రిగా వచ్చే వేతనం, భత్యాలు వారికే వెచ్చిస్తానంటూ చేసిన ప్రకటనకు అనుగుణంగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 42మందికి రూ.5వేల వంతున రూ.2.10లక్షలను పంపిణీ చేశారు. తొలినెల పవన్‌కల్యాణ్ స్వయంగా పిల్లలకు ఈ మొత్తాలను అందించారు. ఈ నెల జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఇతర నాయకులు బుధవారం వారి ఇంటింటికీ వెళ్లి రూ.5వేల వంతున అందజేశారు. నా జీతం-మీ జీవితం కోసమంటూ పవన్‌కల్యాణ్ నిస్వార్థంగా తనకు వచ్చే వేతనాన్ని పిల్లల భవిష్యత్తుకు వెచ్చిస్తున్నారని మర్రెడ్డి తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమేగాక తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు అనుక్షణం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో మాధవి తదితరులు

అమలాపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లాస్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి క్రీడాకారుల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ద్రాక్షారపు సాత్విక్ (ప్రథమ), తాడి వెంకటేష్ (ద్వితీయ), బండారు నానిబాబు (తృతీయ), పణిశెట్టి ధరణి (చతుర్థ) స్థానాల్లో నిలిచారు. ఈ నెల 6వ తేదీ నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు వీరిని ఎంపిక చేసినట్టు వెంకట సురేష్ తెలిపారు. విద్యార్థులకు విద్యానిధి ప్రిన్సిపాల్ టి.మాధవి షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

# 10న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

- ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ కేతన్ గార్గ్


టాటా ఇన్నోవేషన్ హబ్ సెంటర్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఆర్డీఐహెచ్ భవనం ఏర్పాటు చేస్తున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఈనెల 10న ప్రారంభిస్తున్నట్లు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. బుధవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు పనులు కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా పలుసూచనలు సంబంధిత అధికారులకు చేశారు. అనంతరం కమిషనర్ కేతన్ మాట్లాడుతూ గడువు తేదీ సమీపిస్తుండటంతో పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రూ.75లక్షల వ్యయంతో ఆర్డీఐహెచ్‌భవనాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. రాత్రి పగలు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. స్కిల్‌డవలప్‌మెంట్, ఇన్నోవేషన్ స్టార్టప్స్, ఫెసిలిటీ కేంద్రంగా ఈ ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందన్నారు. రతన్ టాటా స్ఫూర్తితో ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేసి తద్వారా ఆయా కుటుంబాలను బాగుచేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట కార్పొరేషన్ ఎస్ఈ ఎంసిహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మదర్సా ఆలీ షేక్, జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్ వి.శాంతామణి, ఎంపీడీవో ఆంగ్స్ట్రాంగ్, ఇతర అధికారులు ఉన్నారు.

## 9న చిరంజీవినీకుమారి సంస్మరణ సభ

కాకినాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ప్రముఖ విద్యావేత్త, ఐడియల్ విద్యా సంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఈనెల ఒకటో తేదీన కన్నుమూసిన సంగతి తెలిసిందే. కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఇంద్రపాలెం లాకులవద్ద గల ఐడియల్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 9న చిరంజీవినీకుమారి సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

# జాతీయస్థాయి యోగా పోటీలకు ముగ్గురు ఎంపిక


యోగా పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత భైరవస్వామి

అమలాపురంటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బండారు మేఘన, చామకూర వర్ధిని, గుత్తుల ప్రవీణ్ జూనియర్ కేటగిరీలో ప్రతిభ చాటారు. వీరు ఈ నెల 12న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను రాష్ట్రపతి అవార్డు గ్రహీత, యోగా నేషనల్ జడ్జి మోటూరి భైరవస్వామి తదితరులు అభినందించారు.

# కండిషనల్ అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా


కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కండిషనల్ అపాయింట్‌మెంట్ ద్వారా నియమించిన 229 మంది అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలని ఏపీ అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ మాట్లాడుతూ అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయడంలో జిల్లా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంవల్లే 229 మంది అభద్రతాభావంలో ఉన్నారన్నారు. ఉద్యోగంలో చేరే సమయంలో కండిషనల్ అపాయింట్‌మెంట్ అని చెప్పకుండా పోస్టులు భర్తీ చేశారని విమర్శించారు. ఇప్పుడు రోస్టర్‌ను అనుసరించారని, 13ఏళ్లుగా పని చేస్తున్న వీరిని తొలగించడం తగదన్నారు. 2020లో అప్పటి మంత్రి తానేటి వనిత ఆదేశాల మేరకు కండిషనల్ అపాయింట్‌మెంట్‌లో ఉన్న వారిని కొనసాగించాలని సర్క్యులర్ ఇచ్చినప్పటికీ జిల్లా అధికారులు హైకోర్టుకు సమర్పించకుండా తప్పుదోవ పట్టించారన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, రాజేశ్వరి, ప్రసన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు

# వాట్సాప్‌లో విద్యార్థుల ప్రచారం


పర్యావరణంపై ప్రచారం చేస్తూ విద్యార్థులు గీసిన చిత్రాలు

సీతానగరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పర్యావరణంపై చిత్రలేఖనం ద్వారా బుధవారం ప్రచారంచేసి స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బొబ్బిల్లంక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సూరంపూడి వైష్ణవి, తెల్లాం వీరవెంకట శ్రీదేవిలు పర్యావరణ పరిరక్షణ చిత్రాలు గీసి సోషల్ మీడియాద్వారా వాట్సాప్ గ్రూప్ ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. విద్యార్థులను హైస్కూల్ హెచ్ఎం కోలా సత్యనారాయణ విద్యార్థులను అభినందించారు.

# కొడుకు ఊపిరి ఆపి.. చున్నీతో ఉరేసుకుని..

## కాకినాడలో మహిళ బలవన్మరణం

**కుటుంబ సమస్యలతో నిర్ణయం**



రమ్యదీప్తి, సియాన్ ప్రశాంత్ మృతదేహాలు

కాకినాడ క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అభం, శుభం తెలియని నాలుగేళ్ల కొడుకు నోరు, ముక్కుకు పార్సిల్స్‌కు వేసే ప్లాస్టర్‌ను బిగించి ఊపి రాడకుండా చేసి చనిపోయిన తరువాత తల్లి కూడా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన బుధవారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఉండేశ్వ రపురానికి చెందిన రమ్యదీప్తి (30)కి కాకినాడ రేచర్లపేట దొర్ల వారి వీధికి చెందిన రాజాల శరత్‌బాబుతో 5ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి నాలుగేళ్ల కుమారుడు సియాన్ ప్రశాంత్ ఉన్నాడు. కాగా భార్య భర్తలిద్దరూ కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కొడుకుతో పాటు గల్ఫ్‌లోని అబుదబిలో ఉన్నారు. అయితే శరత్‌బాబుకు అక్కడ నుంచి వేరే చోటకు ట్రాన్స్‌ఫర్ అవ్వడంతో ఇక్కడ ఒంటరిగా ఉండడం ఎం దుకు ఇండియాకు వెళ్లిపోమ్మని భార్యకు చెప్పడంతో రమ్యదీప్తి కొడుకుని తీసుకుని 2 నెలల క్రితం ఇండియాకు వచ్చి సీతానగరంలోని అమ్మగారి ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి 10 రోజు ల క్రితం కాకినాడ రేచర్లపేటలో ని అత్తగారింటికి వచ్చింది. అయి తే ఎంఎస్సీ చదివిన రమ్యదీప్తిని అత్త శాంతి, ఆడపడుచు మెర్సీ కలసి ఇంత చదువుకుని ఖాళీగా ఏం చేస్తా వ్ గల్ఫ్ వెళ్లి సంపాదించు అంటూ ప్రతిరోజు మానసికంగా వేధిస్తుండడంతో తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం అర్థరాత్రి దాటాక తలుపులు గడియ పెట్టుకుని కొడుకుకు ఊపిరాడ కుండా నోరు, ముక్కుకి ప్లాస్టర్ వేసి చనిపోయాడని నిర్ధారించుకున్నాక తాను కూడా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని విగత జీవురాలైంది. ఉదయం 8 అయినా తలుపులు తీయకపోయేసరికి అత్త, ఆడపడుచుకు అనుమానం వచ్చి కిటికీ గుండా చూసేసరికి తల్లీకొడుకులు విగతజీవులు గా ఉండడాన్ని గమనించారు. అనంతరం స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి గుడేటి అరు ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జ్ సిఐ కెవి సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

- మహిళకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన శారదలీల



మరణించిన అఖిల్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో పదకొండేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి ప్రత్తిపాడు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో ఎస్.శారదలీల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. కాకినాడకు చెందిన అఖిల్ (11) వేసవి సెలవుల కారణంగా కొన్ని రోజులుగా మేనత్త శారదలీల ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం ప్రత్తిపాడులో తన పెద్ద నాన్న సంవత్సరీకంలో పాల్గొనేందుకు శారదలీల మేనల్లుడిని తీసుకుని ద్విచక్ర వాహనంపై బయల్దేరింది. వారు ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పోలవరం కాలువ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ 108 అంబులెన్సులో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ తరలిస్తుండగా సామర్లకోట వచ్చేసరికి బాలుడి పరిస్థితి విషమించడంతో అక్కడి ప్రభుత్వాసుత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన శారదలీలను కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా అఖిల్ తండ్రి ఎస్‌టీజీ భాష్యం కాకినాడ ఆదిత్య కాలేజీలో లెక్చరర్‌గా, తల్లి నిహారిక ఓ ప్రైవేటు స్కూలులో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. అఖిల్ మృతితో అతడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# ఆపేదే లేదు!

**మన్యంలో ఆక్రమణల తొలగింపు**

**ఆగదని టీడీపీ నేతలకు**

**తేల్చిచెప్పిన అల్లూరి కలెక్టర్**

రంపచోడవరం, జూన్ 4 (ఆంధ్రప్రదేశ్): మన్యంలో రహదార్ల వెంబడి ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను ఆపేదే లేదని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తనను కలిసిన రంపచోడవరం నియోజకవర్గ దేశం నేతలకు తేల్చి చెప్పేశారు. ఇక్కడ జరుగుతున్న ఆక్రమణల తొలగింపుతో అనేక నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేసిన పర్యవసానాలపై ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎవరికి వారు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వివరించిన నేపథ్యంలో కూల్చివేతల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలనిచ్చిందన్న వదంతులు రావడంతో యోగా కార్యక్రమం కోసం రంపచోడవరం వచ్చిన కలెక్టర్ దినేష్‌ను ఎమ్మెల్యే శిరీష దేవి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వేర్వేరుగా కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించారు. అనంతరం కలెక్టరు ఈ ఆక్రమణల తొలగింపుపై స్పందిస్తూ ఈ తొలగింపు ప్రక్రియ ఆపేది లేదని, ప్రజలు తమకు తాముగా వారి ఆక్రమణలను వారే తొలగించుకునే అవకాశాన్ని ఇస్తున్నామన్నారు. అయినప్పటికీ వారు తొలగించకుంటే మాత్రం తామే తొలగించేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు ఆయా ఆక్రమణలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకపోతే ప్రొక్లయిన్లతో తామే తొలగిస్తామంటూ టాం టాం వేశారు.

## మహిళపై దాడి చేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

అమలాపురం రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేసిన ఘటనపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. కోనసీమ జిల్లా వన్నెచింతలపూడి జైబీమ్ నగర్‌కు చెందిన పచ్చిమాల అనంతలక్ష్మి(49) ఇంటి వాడకం నీరు ఎదురుగా ఉన్న తోటల్లోకి వెళ్లిందన్న నెపంపై తోట యజమాని జంపన వెంకటసుబ్బరాజు మంగళవారం ఆమెతో ఘర్షణకు దిగాడు. అంతేకాకుండా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కొబ్బరి మట్టతో ఆమెపై దాడి చేశాడు. దాంతో గాయపడ్డ ఆమెను అమలాపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు విచారణ జరిపి అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటసుబ్బరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనంతలక్ష్మి వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు పలువురు పరామర్శించారు.

## పేలు మందు తాగిన వ్యక్తి మృతి

కరప, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన పెన్నాడ వీరబాబు (38) కాకినాడలోని ఒక ఫిషరీస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 1న మంచినీళ్ల అనుకుని పొరబాటున పేలు మందు మిశ్రమాన్ని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్ఐ వివరించారు.

# గోల్డ్ అంతా దోచేసి.. రోల్డుగోల్డ్ వదిలేసి..

- వాకతిప్పలో చోరీ
- 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు పట్టుకెళ్లిన దొంగలు



దొంగలు వదిలేసిన రోల్డుగోల్డ్ ఆభరణాలు

కొత్తపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో ఓ ఇంట్లో దొంగలు పడి 12 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.20లక్షల నగదును అపహరించుకుపోయారు. కేవలం బంగారు వస్తువులనే తీసుకుని రోల్డుగోల్డ్ ఆభరణాలను దివాన్‌కాట్‌పై పెట్టేసి వెళ్లిపోయారు. వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం పొన్నాడు శివారు శీలం వారి పాలెం ఎలిమెంట్రీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పేరూరి శ్రీనివాసరావు వాకతిప్పలో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఈనెల 2న అన్నవరంలో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇంటి వెనుక పిట్టగోడ నుంచి లోపలికి ప్రవేశించారు. ఇంటి రెండు గదుల్లో ఉన్న బీరువాలను మారుతాళాలతో తెరిచి లాకర్లో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, హాలులో బాక్స్‌లో వేసిన 10 రూపాయల కాయిన్లు రూ.20 వేలను అపహరించుకుని పోయారని శ్రీనివాసరావు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం తెల్లవారుజాము సమయంలో తమ ఇంటి పరిసరాల్లో ఉండే ఒకరు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఫోన్‌లో చెప్పడంతో సీసీటీవీని పరిశీలించేసరికి తమ ఇంటి గుమ్మం వద్ద సీసీ కెమెరా వేలాడుతూ కనిపించడంతో వెంటనే అన్నవరం నుంచి బయలుదేరి ఇంటికి చేరుకుని చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని, బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయని శ్రీనివాసరావు పేర్కొన్నాడు. కేవలం బంగారు వస్తువులనే తీసుకుని రోల్డుగోల్డ్ ఆభరణాలను దివాన్‌కాట్‌పై పెట్టేసి పోయినట్టు గుర్తించారు. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ చోరీ జరిగిన ఇంట్లో ఉన్న సీసీ టీవీ పుటేజీని పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుక నుంచి లోపలికి వచ్చి సీసీ కెమెరాను పక్కకు తిప్పినట్టుగా ఉండటం రికార్డు అయ్యింది. ఇంటి లోపలకు వెళ్లినట్టు ఏ ఆధారాలు లేకుండా దొంగలు చాకచక్యంగా చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. కాకినాడ నుంచి వచ్చిన వేలిముద్రల నిపుణులు బీరువాలు, ఇంటి తలుపులపైన వేలిముద్రలను సేకరించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.



సీసీటీవీ పుటేజిని పరిశీలిస్తున్న కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్

# అత్తతో గొడవపడి కోడలు ఆత్మహత్య



సౌమ్య మృతదేహం

కరప/యానాం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అత్తతో గొడవపడి క్షణికావేశంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన వివాహిత యానాం- ఎదుర్లంక బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన ఆట్ల సౌమ్య(23)కు రెండేళ్ల క్రితం సుబ్బరాజుతో వివాహం కాగా వారికి ఒక పాప ఉంది. మంగళవారం అత్తతో సౌమ్య గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కంగారుపడిన కుటుంబసభ్యులు అదేరోజు రాత్రి కరప పోలీసులకు ఫిర్యాదుచేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే బుధవారం యానాంలోని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు అక్కడి పోలీసుల నుంచి కరప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. దీనిపై మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ అత్తింటి వేధింపుల కారణంగా సౌమ్య మృతిచెందిందని మృతదేహంతో కరప పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. మృతురాలికి న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్ఐ తోట సునీత ఇరువర్గాలతో చర్చించారు. మృతురాలి బంధువులకు పాపను అప్పగించి, 5 కుంచాల పొలాన్ని రాసివ్వడానికి భర్త తరఫు పెద్దలు ఒప్పుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

# కార్లు.. తప్పిన పెను ప్రమాదాలు!



తూర్పుగోదావరి జిల్లా చక్రద్వారబంధంలో నుజ్జునుజ్జు అయిన కారు

- చక్రద్వారబంధంలో విద్యుత్ స్తంభాలను ఢీకొన్న ఐదుగురు విద్యార్థులు
- స్వల్ప గాయాలతో సురక్షితం
- సఖినేటిపల్లిలంకలో కారుపై పడిన కొబ్బరిచెట్టు
- నలుగురికి తప్పిన ప్రాణగండం

రాజానగరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధంలో బుధవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిని ఆనుకుని సమీపంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు బుధవారం ఫుల్‌గా మద్యం తాగి కారులో చక్రద్వారబంధం నుంచి కానవరం పోవు రోడ్డులో పందిగొయ్యి చెరువు సమీపంలో రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొన్నారు. దీంతో స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కారు నుజ్జునుజ్జు అయ్యింది. సమీపంలోని రైతులు భయాందోళనతో పరుగులు తీశారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, పాడి గేదెలు లేకపోవడంతో సమీపంలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను రైతులు ప్రశ్నించగా గైట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన వారమని బదులిచ్చారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు విద్యుత్‌శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రాజానగరం ఏఈ సుధాకర్ తెలిపారు. కాగా విద్యార్థుల ప్రవర్తనా తీరుపై ఆయా కళాశాలల యాజమాన్యాలు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

**సఖినేటిపల్లిలంకలో..**

అంతర్వేది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక సుంకరేవులో శ్రీసత్యసాయి సేవాసమితి ట్రస్టు వద్ద సఖినేటిపల్లిలంక ప్రధాన రహదారిపై వెళ్తున్న కారుపై కొబ్బరిచెట్టు విరిగిపడింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా కొబ్బరిచెట్టు విరిగి విద్యుత్ తీగలపై నుంచి కారు ముందు భాగంపై పడడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రతీ నెల శ్రీసత్యసాయి సేవాసమితి ట్రస్టు సభ్యులు సుంకరేవులో ఉన్న శ్రీసత్యసాయి సేవా మందిరానికి వచ్చి తాగునీటి సరఫరా, అన్నదానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈ సంఘటన వారిని ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి చేసింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎలక్ట్రిక్ అధికారులు విద్యుత్ వైర్లను మరమ్మతులు చేసి చెట్టు తొలగించారు.



కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలంకలో కారుపై పడిన కొబ్బరిచెట్టు

## గంగలకుర్రు అగ్రహారంలో చైన్‌స్నాచింగ్

**మహిళ మెడలో బంగారు సూత్రాలతాడు లాక్కెళ్లిన దుండగులు**



సూత్రాలతాడు పోగొట్టుకున్న మహిళ

అంబాజీపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం చేసుకుని ఇంటికి వెళ్తున్న మహిళ మెడ లో మంగళసూత్రాలతో ఉన్న తాడును గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి లాక్కుని వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో మంగళవారం శ్రీరావులమ్మ తీర్థం జరిగింది. అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చెందిన దొమ్మేటి గంగాభవాని గంగలకుర్రు అగ్రహారం బంధువుల ఇంటికి వచ్చింది. మంగళవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో హైస్కూల్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయ సమీపంలోకి వచ్చేసరికి చీకటి ప్రాంతంలో మోటార్‌సైకిల్ ఇద్దరు వ్యక్తులు వచ్చి మహిళ మెడలో ఉన్న సుమారు రూ.3 లక్షలు విలువైన 4 కాసుల బంగారు సూత్రాల తాడు దొంగిలించుకుపోయారు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు దొంగలను వెంబడించిన్నప్పటికి మోటార్‌సైకిల్‌పై పారిపోయారు. విషయాన్ని పోలీసులకు వివరించడంతో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, ఎస్ఐ కె.చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలు గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## కుటుంబాన్ని భార్య పట్టించుకోవట్లేదని కొడుకు, కూతురితో భర్త ఆత్మహత్యాయత్నం

**పురుగుల మందు తాగడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలింపు**

మలికిపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లికి చెందిన ఒక కుటుంబం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కేశనపల్లికి చెందిన పలివెల నాగేశ్వరరావు (50) తన భార్య లక్ష్మిని ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన కువైట్‌కు పంపాడు. నాగేశ్వరరావుకు పదో తరగతి చదివే కుమారుడు సుమన్, 8వ తరగతి చదివే కుమార్తె ప్రశాంతి ఉన్నారు. భార్య గల్ఫ్ దేశానికి వెళ్లడంతో తన పరిస్థితి మరింత మెరుగవుతుందని ఆశించారు. కూలి పనులు చేసుకునే నాగేశ్వరరావు తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చని ఆశించాడు. కానీ కువైట్ వెళ్లిన లక్ష్మి తన కుటుంబాన్ని పట్టించుకోవడం మానేసింది. ఒకరోజు కాకపోతే మరోరోజు తమను పట్టించుకుంటుందనే ఆశతో ఆ కుటుంబమంతా ఎదురు చూసింది. ఐదేళ్లయినా లక్ష్మి భర్తను, పిల్లల్ని పట్టించుకోకుండా స్వదేశానికి తిరిగి రాకుండా వదిలివేయడంతో మనస్తాపం చెందిన నాగేశ్వరరావు బుధవారం ఉదయ ం పురుగులమందు తాగి తనతో పాటు కుమారుడు సుమన్ (15), కుమార్తె ప్రశాంతి (13)లకు కూడా పట్టించాడు. వీరంతా అపస్మారక స్థితికి వెళ్లడంతో ఇరుగుపొరుగు వారు పట్టించుకుని రాజోలు ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. రాజోలు ప్రభుత్వాసుపత్రిలో వీరు ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఏ ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## రంపచోడవరంలో మహిళ ఆత్మహత్యాయత్నం

**సకాలంలో స్పందించి కాపాడిన పోలీసులు**



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

రంపచోడవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో ఓ మహిళ భూపతిపాలెం రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యా చేసుకునే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకుని ఆమెను కాపాడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. రంపచోడవరానికి చెందిన గుబ్బల చంద్రా వతి(40) తనకు కలిగిన ఇల్లు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మే షాపును ఆక్రమణల తొలగింపులో భాగంగా కూల్చేయడంతో తీవ్ర నష్టానికి గురయ్యామన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రంపచోడవరం శివారులో ఉన్న భూపతిపాలెం ప్రాజెక్టు వద్దకు మంగళవారం రాత్రి వెళ్లి అందులో దూకేందుకు సిద్ధమవుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆమెను నిలువరించి ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి భర్తకు అప్పగించారు.

## చెరువులో పడి మేకల కాపరి మృతి



కుటుంబరావు మృతదేహం

నల్లజర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా పోతవరం గ్రామానికి చెందిన మేకల కాపరి జువ్వాల కుటుంబరావు (55) బుధవారం పాత ఊరు చెరువులో పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం.. కుటుంబరావు చెరువు సమీపంలో మేకలను మేపుతుండగా ఫిట్స్ రావడంతో అందులో పడిపోయాడు. ఎవరూ గమనించక పోవడంతో మృతిచెందాడు. సాయంత్రం చెరువు గట్టుపై నుంచి వస్తున్న రైతులకు మృతదేహం కనిపించడంతో గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు తెలియజే శారు. మృతు డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదు.

## రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ.. యువకుడి మృతి



వీరబాబు (ఫైల్)

జగ్గంపేట రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని వెంగయ్యమ్మపురం గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వెంగయమ్మపురానికి చెందిన వీరబాబు(32) మోటార్‌సైకిల్‌పై మల్లిసాల వెళ్లి తిరిగి వెంగయమ్మపురం వస్తున్నాడు. మార్గమధ్యలో జ్యూస్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి రామవరం గ్రామానికి చెందిన మండపాక చిన్న మోటార్‌సైకిల్‌పై మల్లిసాల వైపు వెళ్తున్నాడు. జ్యూస్ ఫ్యాక్టరీవద్ద వీరు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. వీరబాబు తలకు బలమైన గాయం కాగా జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో గాయపడిన మండపాక చిన్నాకు కాలు ఫ్యాక్చర్ కావడంతో వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం.

## సినీ దర్శకుడు సుకుమార్ పరామర్శ



సత్యవతి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సుకుమార్ కుటుంబీకులు

ద్రాక్షారామ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో పొందిన పీఆర్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబును సినీ దర్శకుడు సుకుమార్ బుధవారం రాత్రి కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెలంపాలెంలో పరామర్శించారు. డీఈఈ మాతృమూర్తి సత్యవతి ఇటీవల వయోభారంతో మృతిచెందారు. దీంతో రాంబాబు స్నేహితుడైన సుకుమార్ తన భార్య తబిత, అక్క లక్ష్మీ, బావ బ్రహ్మాజీలతో కలసి వెలంపాలెం చేరుకున్నారు. రాంబాబును ఓదార్చారు. సత్యవతి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అదేవిధంగా రాంబాబును బుధవారం మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు.

## 'లోవ'కు రూ.2 లక్షల విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

తుని రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణ పనులకు విజయవాడకు చెందిన గంధం రాజేష్‌కుమార్, కాసులదేవి దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు, అమ్మవారి మహాప్రసాదం అందజేశారు.

### 'వెన్నుపోటు పొడిచింది వైసీపీయే'

పి.గన్నవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతను నమ్మించి వెన్నుపోటు పొడిచింది జగనేనని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి జగన్ జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేశారన్నారు. జగన్ పాలనలో అన్నివర్గాల వారికి వెన్నుపోటు పొడిచిందన్నారు.

### నేడు భారీ బైక్ ర్యాలీ

యానాం, జూన్4(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజును పురస్కరించుకుని మల్లాడి అభిమానసంఘం ఆధ్వ ర్యంలో వారం రోజులు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 8గంటల నుంచి స్థానిక మల్లాడి స్వగృహం నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు.

## ప్రజలకు సుపరిపాలన అందించాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేసి ప్రజలకు సుపరిపాలన అందించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. మామిడికుదురు మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ కె.వనజాకుమారి అధ్యక్షతన జరిగింది. ఆదుర్రు సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో తీవ్రంగా ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. రేషన్ కార్డుల మంజూరులో విధివిధానాలు మార్పులు చేయాలని పలువురు సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తెచ్చారు. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో జాతరల సందర్భంగా ఏర్పాటుచేసే ఫ్లెక్సీలను జాతర అనంతరం తొలగించేలా చూడాలని పంచాయతీ అధికారులు, సర్పంచ్‌ల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు మంచి పరిపాలన అందించే దిశగా అధికారులు ఎప్పుడు ముందు ఉండాలని, అలాచేయని పక్షంలో నియోజకవర్గాన్ని విడిచి వెళ్లిపోవచ్చని చురకలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం

అమలాపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచిందని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. తొలుత నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున భట్నవిల్లిలోని విశ్వరూప్ స్వగృహం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మోటారుసైకిల్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. పట్టణ, మండల శాఖల అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు,జడ్పీటీసీలు పందిరి శ్రీహరి, గెడ్డం సంపదరావు, కొనుకు బాపూజీ, చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి):** ముమ్మిడివరంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. అమలాపురం పార్లమెంటు పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. ప్లకార్డులు, బేనర్లను చేతబట్టుకుని ముమ్మిడివరం కాశివాని తూము సెంటర్ నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు.

**మలికిపురం, (ఆంధ్రజ్యోతి):** గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

**పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పి.గన్నవరంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### మండపేటలో రేపు జాబ్‌మేళా

అమలాపురం టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 380కుపైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు వారి విద్యార్హతలను బట్టి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎస్ఎస్‌సీ నుంచి ఇంటర్ డిగ్రీ, బీటెక్, బీఫార్మశీ, ఎం.ఫార్మశీ, పీజీ చదువుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా హ్యుందాయ్ గ్లోవిస్, ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్ పోస్టులు, పానాసోనిక్‌లో టెక్నీషియన్, అపోలో ఫార్మశీలో ఫార్మసిస్టు, అసిస్టెంట్ ఫార్మశీ ట్రైనీ, నవత ట్రాన్స్‌పోర్టులో క్లర్క్, డ్రైవర్, వెహికల్ హెల్పర్, పేటీఎంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీజ్‌లో రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సేల్స్ మేనేజర్, రిలేషన్‌షిప్ మేనేజర్, ఇన్నోవ్ సోర్స్‌లో పలు పోస్టులతో పాటు ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియాలో బీమా సఖి అడ్వైజర్ పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 6వతేదీ ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి. ఆయా పోస్టులకు రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వేతనంతో పాటుఇంటెన్సివ్‌లు అందిస్తారు. బయోడేటా, ఆధార్, ఐడీతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు కె.రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, సెల్:8247645389, వినోద్, హబ్ కో- ఆర్డినేటర్ సెల్:8099183854 సంప్రదించాలన్నారు.

### పోలీసుల దాడి

ముమ్మిడివరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజులపాలెం కాల్వగట్టు రోడ్డులో నివాస గృహాల మధ్య వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ బి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఆ ఇంట్లో విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం పట్టణానికి చెందిన ముగ్గురు మహిళలు ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

### సత్యసాయి రథయాత్రకు ఘన స్వాగతం

మామిడికుదురు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి ప్రేమవాహిని రథయాత్రకు మామిడికుదురులో భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. రథయాత్ర బుధవారం మామిడికుదురుకు చేరుకోగా భక్తులు సాయిబాబా కీర్తనలు ఆలపిస్తూ స్థానిక శివాలయం వరకు ఊరేగింపుగా రథాన్ని తీసుకువెళ్లారు. అక్కడ మహిళలు రథానికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రథంలో ఉన్న సత్యసాయిబాబా ప్రతిమను, స్వామి దివ్యపాదాలు దర్శించుకుని పూజలు చేశారు.

## రాక్షస పాలన అంతమై.. కూటమి సుపరిపాలన

- సుపరిపాలన ఏడాదైన సందర్భంగా కూటమి నేతల సంబరాలు





పి.గన్నవరం: పితానివారిపాలెంలో కూటమి నాయకులతో కలిసి బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే గిడ్డి
మలికిపురం: విశ్వేశ్వరాయపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గుర్రపు స్వారీ

అమలాపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన అంతమై.. సుపరిపాలన ప్రారంభమై ఏడాది అయిన సందర్భంగా జనసేన వీర మహిళల ఆధ్వర్యంలో అమలాపురం నల్లా గార్డెన్స్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బుధవారం 9వ వార్డులో నిర్వహించిన రంగవల్లుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యెండూరి రాఘవ, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి వ్యవహరించారు. ఆయా పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందించారు. అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో బుధవారం రాత్రి రాక్షస పాలన అంతమై ఏడాది పూర్తి అయిన సందర్భంగా జనసైనికులు దీపావళి వేడుకలు నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. తొలుత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న కూటమి నాయకులకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట దీపాలంకరణ చేశారు. ఆయా వేడుక కార్యక్రమాల్లో నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, సూదా చిన్నా, నల్లా పవన్‌కుమార్, ఇసుకపట్ల రఘుబాబు, గొర్తి పవన్, పిండి రాజా, కొప్పుల నాగమానస, కౌన్సిలర్లు పడాల శ్రీదేవి, గండి దేవిహారిక, తిక్కా సత్యలక్ష్మి, గొలకోటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పండగ శోభ

మలికిపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పీడ విరగడై ఏడాదైన సందర్భంగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సంక్రాంతి, దీపావళి పండుగల శోభ ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో మహిళామణులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. భోగిమంటలు, కోడిపందాలు, చిలకజోష్యాలు, గోరింటాకు వేడుకలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. పుంగనూరు ఆవులతో ఉన్న యడ్ల బండి ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే దేవ గుర్రపుస్వారీ చేసి ప్రజలను రంజింపచేశారు. నాటి అరాచక పాలనను ప్రతిబింబిస్తూ మహిళామణులు వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆహ్లాదకరమైన పండుగ వాతావరణంలో జరిగినటువంటి కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం దీపావళిని మరిపించేలా టపాసులు వెలిగించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పినిశెట్టి బుజ్జి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, దేశినీడి తాతాజీ, గుబ్బల ఫణి, మాలే శ్రీనివాసనగేష్, మల్లిపూడి సత్తిబాబు, కుంపట్ల చిన్నారి పాల్గొన్నారు.

### సంక్రాంతి సంబరాలు

మామిడికుదురు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా కూటమి నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. అప్పనపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్టపాలన అంతమై పీడ విరగడై సంవత్సరం గడిచిన సందర్భంగా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య దీపావళి, సంక్రాంతి సంబరాలను నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, తులా బ్రహ్మాజీ, మంద గాంధీ తదితరులు పాల్గొన్నారు.

### 'వైసీపీకి ప్రజల చరమగీతం'

ముమ్మిడివరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైసీపీ రాక్షస పాలనకు నేటికి సరిగా ఏడాది క్రితం ప్రజలు చరమ గీతం పాడారని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ వ్యాఖ్యానించారు. ప్రజలను తీవ్రంగా వేధించిన నాటి పాలకులకు ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరగడాన్ని చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

### కూటమి సంబరాలు

పి.గన్నవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన ముగిసి నేటికి ఏడాది పూర్తయిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సుపరిపాలన ప్రారంభమై రాక్షస పాలన ముగిసిందన్నారు. పి.గన్నవరం శివారు పితానివారిపాలెంలో సంక్రాంతి, దీపావళి సంబరాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తొలుత పితానివారిపాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. అనంతరం ఎమ్మెల్యే, కూటమి నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎడ్ల బండిపై ఊరేగుతూ స్థానిక రామాలయం వద్దకు చేరుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం భోగిమంటలు వేశారు. అలాగే స్థానిక మహిళలు వేసిన రంగవల్లులను ఎమ్మెల్యే పరిశీలించారు. గంగిరెడ్లు, హరిదాసులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈవేడుకల్లో కోడిపందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా ఆ గ్రామంలో ప్రతీ ఇంట దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారు. ముంగండలో స్థానిక కూటమి నేతలు దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, వాసంశెట్టి కుమార్, చెల్లుబోయిన గంగాదేవి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, ఆదిమూలం సూరయ్యకాపు, కుంపట్ల నాయుడు, పప్పుల సత్తిబాబు, రామకృష్ణ, తాటికాయల శ్రీనివాసరావు, ప్రసన్న పాల్గొన్నారు.

### బాణసంచా కాల్చి సంబరాలు

రాజోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కూటమి నాయకులు, అభిమానుల మధ్య కేక్‌ను కటచేసి అందరికీ పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అభిమానులు, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని బాణసంచా కాల్చారు. ఈసందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అంకిత భావంతో పనిచేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో కొత్త దిశగా ప్రయాణిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దార్ల కుమారిలక్ష్మి, బారం రాజా, దారపురెడ్డి బాబ్జి, బారం దొరబాబు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### రంగవల్లుల పోటీలు

అంబాజీపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి చెంది ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రంగవల్లుల పోటీలు నిర్వహించారు.ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, టీడీపీ, జనసేన, బీజేపీ పతకాలతో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచి సుపరిపాలను అందిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక సెంటర్‌లో బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, కొర్లపాటి డీల్లి, రవణం రాము, అరిగెల బలరామమూర్తి, అరిగెల సూరిబాబు, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





అమలాపురం: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు, రాజోలు: బాణసంచా కాల్పులు



### సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఉప్పలగుప్తం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేంద్ర వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త కె.రాజశేఖరరావు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఉప్పలగుప్తం నంగవరం రైతు సేవాకేంద్రంలో బుధవారం సార్వా సాగుపై రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సంజయ్, మాధవన్, జిల్లా వనరుల కేంద్రం ఏడీ ఎ.రాజశేఖర్, అమలాపురం ఏడీ ఎం.ఎ.షంషే, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు. సర్పంచ్‌లు చిక్కం జంగమయ్య, జిన్నూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీపాల్గొన్నారు.

### టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



కాట్రేనికోన, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు గ్రామ టీడీపీ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఇసుకపట్ల వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వైదాడి పాండురంగారావు, ప్రధాన కార్యదర్శిగా తానింకి శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా విత్తనాల రాంబాబు, పులుగు సురేంద్రబాబు, సత్యవాడ రామస్వామి, సాధారణ కార్యదర్శులుగా మారిశెట్టి వెంకటేశ్వరరావు, మెల్లం సువర్ణజ్యోతి, పలివెల నాగేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా పొత్తూరి వీర్రాజువర్మ ఎన్నికయ్యారు. సమావేశంలో పల్లంకుర్రు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్‌గా రాణి



అమలాపురంటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బి.రాణిసంయుక్త బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన కేవీఆర్ఆర్ రాజు బదిలీపై రామచంద్రపురం పురపాలక సంఘానికి వెళ్లారు. టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న రాణిసంయుక్తకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### గజమాల యాత్రను విజయవంతం చేయండి

మామిడికుదురు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బాలబాలాజీ ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి మహా గజమాల యాత్రను విజయవంతం చేయాలని శెట్టిబలిజ సంఘ మండల అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ కోరారు. మామిడికుదురులో బుధవారం స్థానిక బీసీ సామాజిక భవనం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10గంటల నుంచి తాటిపాక శెట్టిబలిజ సంఘ భవనం నుంచి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈగజమాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అప్పనపల్లిలోని ఆలయ సమీపంలో గల మొల్లేటి రామస్వామి-ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు అలంకరణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బొక్కా వీరవెంకటేశ్వరరావు, నయినాల సత్యనారాయణమూర్తి, పెచ్చెట్టి సత్యచంద్ర, కడలి నూకరాజు, నయినాల రామకృష్ణ, సూరంపూడి రామకృష్ణ, నయినాల కాశీ, కంచి శ్రీను, జోగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా తప్పదు

ముమ్మిడివరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ శానిటేషన్ విభాగం బుధవారం పట్టణంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వివిధ రకాల షాపుల యజమానుల నుంచి రూ.3400 జరిమానా వసూలు చేశామని ఇన్‌చార్జి కమిషనర్ పీవీ సుధాకర్ తెలిపారు. తనిఖీల్లో హెల్త్‌అసిస్టెంట్, శానిటరీ ఇనస్పెక్టర్ జె.సత్యనారాయణరాజు, శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ఐ.పోలవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై బుధవారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం వద్ద అవగాహన కార్యక్రమం జరిగింది. విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ వీధినాటకం కళాజాత బృందం ఈకార్యక్రమాన్ని నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్రజలకు కళారూపంలో వివరించారు.

### సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పెరిగిన టెక్నాలజీని ఆసరాగా చేసుకుని సమాజంలో అంతకంతకూ పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేలా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎస్ఐ గంగాభవానీ పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తదారులు తొక్కుతూ ప్రజలను మోసగిస్తున్న వైనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బండారులంక పంచాయతీ కార్యాలయంలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్‌జీసీ ఆధ్వర్యంలో సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మాజీ ఎంపీటీసీ మాడా మాధవి, గ్రామ కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాసరావు,బుజ్జిరాజు, ఫణి పాల్గొన్నారు.

### రెండు తాటాకిళ్లు దగ్ధం

అంబాజీపేట, జూన్4(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో మంగళవారం రాత్రి వాకలగరువు బుల్లియ్య కాలనీకి చెందిన దాకే శ్రీనివాసరావు, ముత్తాబత్తుల వీరవెంకట సత్యనారాయణలకు చెందిన రెండు తాటాకిళ్లు దగ్ధం అయ్యాయి.ఆ ఇంట్లో నివాసం ఉంటున్న డాకే వెంకట్రావు, ముత్తాబత్తుల దుర్గారావు కుటుంబాలు నిరాశ్రయిలయ్యారు. రూ.5లక్షలు ఆస్తినష్టం ఏర్పడి నట్టు అంచనా వేస్తున్నారు. బాధితులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.04 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,04,678 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి కాకినాడకు చెందిన అడపా వీరవెంకట సంతోష్‌కుమార్, మృధుల సంతోషిణి దంపతులు రూ.25 వేలు, రాజానగరం మండలానికి చెందిన గిరిజాల రామకృష్ణ, దేవి దంపతులు రూ.25వేలు విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నేడు యంత్ర ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి

కపిలేశ్వరపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమరఖండ్రికలో గురువారం తటాక(లక్ష్మీనారాయణ) నాభిశిల యంత్ర ప్రతిష్ఠను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం గవ్యాంత పూజ, మార్జనలు, వాస్తుపూజ, హోమం తదితర పూజలను వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. గురువారం సంకల్పం, యంత్రపూజ అనంతరం ఉదయం 7.49 గంటలకు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, కలాన్యాసం, దృష్టిగోవు, స్వామివారి దర్శనం, పూర్ణాహుతి, అగ్ని ప్రదక్షిణం, శాంతి కల్యాణం అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.



పడమరఖండ్రికలో స్వామివారి గ్రామ ప్రదక్షిణం నిర్వహిస్తున్న దృశ్యం

### నేడు సత్తెమ్మ సంబరం

రాయవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వెదురుపాక-అరికరేవుల రోడ్డులో ఉన్న కొర్లవారి సత్తెమ్మ సంబరాన్ని గురువారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సంబరాన్ని పురస్కరించుకుని గరగలకు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం సంబరాన్ని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, నిర్వహిస్తామని ఎం.సురేష్ తదితరులు తెలిపారు.

### నేడు సత్యసాయిబాబా రథం రాక

మండపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని గురువారం సాయిబాబా దివ్య వాహనం మండపేటకు వస్తున్నదని పట్టణ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# ఘనంగా కూటమి శ్రేణుల విజయోత్సవం

**• ఆయా గ్రామాల్లో బాణసంచా కాల్పులు • కేక్ కట్ చేసిన ప్రజా ప్రతినిధులు • మిఠాయిల పంపిణీ**

ఆలమూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ఆలమూరు మండలంలో కూటమి నాయకుల అధ్వర్యంలో సంబరాలు జరిపారు. పెనికేరులో కూటమి నాయకుల అధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ముగ్గుల మధ్యలో ఏడాది పాలనకు సంబంధించిన పోస్టర్స్‌ను కూటమి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గన్ని భాస్కరరావు, కోన దత్తుడు, సూరపురెడ్డి సత్య, సంగిత సుభాష్, గారపాటి శ్రీనివాస్‌చౌదరి, కొత్తపల్లి నగేష్, భైరిశెట్టి రాంబాబు, చల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.

### వానపల్లి పళ్లాలమ్మకు టీడీపీ శ్రేణుల పూజలు

**కొత్తపేట, (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రగతిని వైసీపీ నేతలు దెబ్బతీస్తున్నారని, వారి నుంచి రాష్ట్రాన్ని కాపాడాలంటూ వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారికి టీడీపీ శ్రేణులు పూజలు జరిపారు. పార్టీ మండల అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి మాట్లాడుతూ వెన్నుపోటు, పన్నుపోటు, రక్తపోటు అంటూ వైసీపీ నాయకుల ప్రచారాలు వారి మానసిక పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. వైసీపీ నేతల కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, చవల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ రాక్షస పాలన నుంచి విముక్తి రోజు
### మాజీ ఎమ్మెల్సీ చౌదరి

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రం విముక్తి పొందిన రోజు జూన్ 4 అని మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని కూర్మాపురం గ్రామంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం దూసుకుపోతోందన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే ఈ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు.

**రామచంద్రపురం (ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధితో ప్రజల నమ్మకాన్ని సుస్థిరం చేసుకుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. బుధవారం రామచంద్రపురంలో టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో విజయోత్సవాన్ని జరిపారు. టీడీపీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డులో ప్రదర్శన జరిపి రాజగోపాల్ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కేకు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వుండవిల్లి శివ, కడియాల రాఘవన్ తదితరులతో పాటు, జనసేన నాయకులు అంకం శ్రీనివాస్, సంపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన టీడీపీ నాయకులు

### టీడీపీ శ్రేణుల సంబరాలు

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన నేపథ్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం రాత్రి ఆత్రేయపురం రేవులో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచడంతో పాటు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు తదితరులతో పాటు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

### బోసుబొమ్మ సెంటర్‌లో..

**ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి):** కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరరావు తదితరులు భారీ కేక్ కట్‌చేశారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, డాక్టర్ మడకా రాంబాబు, పెంకె సాంబశివరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పార్టీశ్రేణుల జోష్

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టంగట్టి ఏడాది పూర్తైన సందర్భంగా కూటమి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్‌కట్ చేసి స్వీట్స్ పంచి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### విజయోత్సవంలో కూటమినేతలు

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా బుధవారం మండపేటలో కూటమి నాయకులు సంబరాలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో నామాల చంద్రరావు, సరాకులు అబ్బులు, టీడీపీనేత ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన నేతృత్వంలో జరిగిన విజయోత్సవంలో పలువురు నేతలు పాల్గొన్నారు, ఏపీఐడీసీ చైర్మన్, మండపేట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదేశాల మేరకు జనసైనికులు, టీడీపీ శ్రేణులు పట్టణంలో బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామచంద్రపురం మెయిన్ రోడ్డులో విజయోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు



### మండపేటలో రేపు జాబ్‌మేళా

అమలాపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డి.హరిశేషు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయ న్నారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడీతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు కె.రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, 82476 45389, వినోద్, హబ్ కో-ఆర్డినేటర్, 80991 83854లో సంప్రదించాలన్నారు.

### కొనసాగుతున్న శ్రీవాణి శాంతియుత దీక్ష

మండపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేశవరంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ కోసం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతియుత దీక్షను కొనసాగిస్తున్నారు. ఆమె దీక్ష బుధవారం నాటికి 48వ రోజుకు చేరింది. గ్రామంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మాణంలో రాజకీయాలు పక్కన పెట్టి ప్రహరీని నిర్మించి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని అమె దీక్ష చేస్తు న్నారు. బుధవారం జ్వరంతో బాధపడుతూ దీక్ష సాగించారు. రోహిణికార్తె ఎండను సైతం లెక్క చేయకుండా ఒంటరిగా దీక్ష చేస్తు న్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం తాను దీక్ష కొనసాగిస్తానని ఆమె తెలిపారు.



కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంకలో సర్పంచ్ గవరయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



కొత్తపేటలో పర్యావరణ దినాన్ని పురస్కరించుకుని మొక్కలను పంపిణీకి సిద్ధం చేసిన సర్పంచ్ బాబు

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

కపిలేశ్వరపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంకివారిలంక, కేదార్లంక, వీధివారిలంక గ్రామాల్లో బుధవారం శ్రమ కోఆర్డినేటర్ నాగేశ్వరి పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చైల్డ్ కలెక్టివ్ పిల్లలు, కిషోర బాలికలు శ్రమ టీంతో కలిసి గ్రామంలోని పండ్లతోటలు, కూరగాయ తోటల్లో పర్యటించి వాటి ఆవశ్యకతపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తమ పరిధిలో ఉన్న స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటాలని గ్రామ సర్పంచ్ నాతి గవరయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ కలెక్టివ్ పిల్లలు, కిషోరి బాలికలు, శ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఆత్రేయపురం మండలంలోని కట్టుంగలో అటవీశాఖ, ఎన్ఆర్ఈజీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కల పెంపక కేంద్రం నిర్వహించారు. సుమారు 80 వేల మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. రోడ్ల వెంబడి గట్లు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే చర్యలు చేపడుతున్నారు. కావాల్సిన రైతులు మొక్కల పెంపకం కేంద్రంలో ఆధార్‌కార్డు అందించి ఉచితంగా పొందవచ్చన్నారు.

**కొత్తపేట, (ఆంధ్రజ్యోతి):** అంతర్జాతీయ పర్యావరణ దినాన్ని పురస్కరించుకుని వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు గ్రామంలో ప్రతి ఇంటికి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని సుమారు వెయ్యి కుటుంబాలకు వారి ఇళ్ల ముందు మొక్కలు పెంచే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆయా గ్రామాలు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆత్రేయపురం మండలం కట్టుంగలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

### కేశవస్వామి ఆలయంలో యోగా శిక్షణ

ఆత్రేయపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకుడు పెన్మత్స వెంకట్రాజు సిబ్బందికి యోగా శిక్షణ జరిపారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి పాల్గొన్నారు.



ర్యాలి కేశవస్వామి ఆలయంలో యోగా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

# రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

రాయవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ మండల అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. బుధవారం రాయవరంలో ఏవో మాట్లాడుతూ ఎంటీయూ 7029 రకం విత్తనాలు 60 కింటాళ్లు, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 10 కింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**రైతులకు విత్తనాల పంపిణీ:** వెదురుపాక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు టి.తులసీదర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కె.చంటిరెడ్డి చేతుల మీదుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొవ్వూరి నాగిరెడ్డి, కటారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

రావులపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కాపు ఉద్యమ సమయంలో జరిగిన తుని ఘటనపై అప్పటి కేసులు రీఓపెన్ చేస్తారంటూ వచ్చిన దానిపై స్పందించిన ప్రభుత్వం కేసు అప్పీల్ ఉపసంహరిస్తూ జీవో విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాపు ఉద్యమనేత ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెం కాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుని ఘటనలో వచ్చిన అభియోగాలు నిరూపితం కాలేదు. అరాచక శక్తులు చేసిన పనికి ఉద్యమ నాయకులపై కేసులు పెట్టడం సరికాదని అప్పట్లోనే కేసులు కొట్టివేశారన్నారు. 2021లో తునిలో జరిగిన రైలు దగ్ధం కేసులో తనతో పాటు 42 మందిపై రైల్వే శాఖ పెట్టిన కేసు అప్పీల్ చేస్తు జారీ చేసిన జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాపు సంఘ అధ్యక్షులు నందం వీరవెంకట సత్యనారాయణ, జక్కంపూడి వెంకటస్వామి, నందం కాశీ, ఆకుల భీమేశ్వరరావు, సాధనాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వాగ్దానాలు విస్మరించినందుకే వెన్నుపోటు దినం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు విస్మరించిందని, అందువల్లే వెన్నుపోటు దినం నిర్వహించామని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం రామచంద్రపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం ఆర్డీవో దేవరకొండ అఖిలకు ఎంపీ బోస్, వైసీపీ నాయకులు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీలు అంబటి భవానీ, పంపన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** రావులపాలెం జాతీయ రహదారిపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. రావులపాలెం వైసీపీ కార్యాలయం వద్ద నుంచి రావులపాడు మీదుగా తహశీల్దారు కార్యాలయానికి చేరుకుని తహశీల్దారు ముక్తేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందచేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడారు. తొలుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో తయారు చేసిన దిష్టిబొమ్మను దగ్ధం చేయాలనే ప్రయత్నం చేయగా, సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో దాన్ని అడ్డుకుని ర్యాలీలోకి తీసుకుని వెళ్లకుండా నిలువరించారు.

### 'రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది'

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నదని వైసీపీ ఎమ్మెల్సీతోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు. బుధవారం వెన్నుపోటు దినం పేరిట నియోజకర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు సారధ్యంలో పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు నాయకులు ర్యాలీగా బయలుదేరి మెయిన్‌రోడ్డు, కేపీరోడ్డు మీదుగా మండపేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావుకు వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడినూకదుర్గారాణి, ఎంపీపీ ఉండమట్ల వాసు, వైసీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.